# అరణ్యరోదన

## వేణుగోపాల్

రామరావణ యుద్ధం ముగిసింది. లక్ష్మణుడు లంకానగరపు అందాలకు ముగ్ధుడై "మనం ఇక్కడే ఉండి లంకను ఏలుకుందాం. భరతుడు అయోధ్యను పాలించనీ" అని అన్నాడట. దానికి రాముడు సమాధానంగా

"అపిస్వర్ణ మంలూాలంకామేరోచతి లక్ష్మణ
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని పలికాడట.

అవతార పురుషుడైన శ్రీరామచంద్రునికే స్వస్థలం మీద అంతమక్కువకదా ఇంక మనబోట్ల సంగతి చెప్పాలా.

రెండు గోదావరులమధ్య అందాల కాణాచి, కోనసీమ లంకనుంచి ఒరిస్సాలో మీరు మూలజిల్లాలో మరో మారుమూల ఊరుకు ప్రమోషన్ మూలానవచ్చిన ట్రాన్స్ఫరుపై వెళ్లక తప్పలేదు.

కాకులు దూరని కారడవి కాకపోయినా మనుషులు దూరగలిగిన చిట్టడివి మధ్యలో పల్లె వల్లెవాటులో ఇమడలేక పట్నపు అందాలు సంతరించుకోలేక అవస్థపడుతున్న ఆ చిన్నఊరులో పెట్టిన బాంకు బ్రాంచికి మానేజరుగా అడుగెట్టారు. రైలు దిగగానే ప్లాట్ఫారం నుంచే వెళ్లిపోవాలనిపించింది. చుట్టూ ఎత్తైన కొండలు, వాటిపై అక్కడక్కడ పొదలూ చెట్లూ.

మీగడ పెరుగు, కొబ్బరి పచ్చడి, పనసకాయ కూర వీటన్నిటికీ దూరమై ఇక్కడ ఎలా ఉండాలి? భాష కొత్త,మునుషులు కొత్త. పగలంతా బ్రాంచిలో అవస్థపడి రెండు పూటలా చెయ్యికాల్చుకోక తప్పలేదు. పెళ్లైన వెంటనే హనిమూన్ లేకపోయినా, నడివయసులో వాన ప్రస్థాశ్రమం వచ్చిపడింది.

ఇంత చిన్న ఊళ్లో కాస్త ఒళ్లు వెచ్చబడినా.స్కూటరు పాడైనా రిపేరు కష్టం. బాంకులూ, ప్రభుత్వం ధారాపాతంగా పంచే అభివృద్ధి తాలూకు సొమ్ము ఎడారిలో నీటిలా ఇంకిపోయి, అభివృద్ధి ఎండమావుల్లో, అవినీతి జేబుల్లో దాక్కుంటోంది.

బ్రిటిషువాళ్ల ధర్మమా అని, అదివరకే తామరతంపరగా ఉన్న రాజులు రాజ్యాలమాట అలా ఉంచి, జమీందార్లూ జాగీర్దార్లూ కూడా పుట్టుకొచ్చారు. స్వతంత్రం వచ్చాక వీలున్నవాళ్లు రాజకీయపురంగులు మార్చి ఆస్తులు పెంచి తమ జన్మ భూముల్ని దాదాపుగా విడిచి, నగరాల విలాసాలలో రాజకీయ కులాసాలలో, వ్యసనాల మసాలాలలో తేలసాగారు. అలా రాజరికాలు వెలిగిన నాటి రాజప్రాసాదాన్ని తరువాతి వారసులు నామమాత్రపు అద్దెకు బాంకు పరం చేసారు. అందులో మాబ్రాంచి, అందులోనే ఒక గదిలో నాబస.

ఎత్తైన ప్రహరీ, రెండువైపులా సింహతలాటాలతో కట్టిన భారీ ఇనుపగేటూ, దానికి అరఫర్లాంగు దూరంలో పోర్టికో. ఆవరణలో తుప్పుపట్టిన ఫిరంగి. అక్కడక్కడ చిన్న పెద్దా మొక్కలు పొడుచుకొస్తున్న బీటలువారిన భవనం. సింహం గుహలా ప్రతిధ్వనించే పెద్దహాలు. ప్రజల కష్టాలకూ కన్నీళ్ళకూ నగిషీలు చెక్కినట్టున్న ఎత్తైన గోడలు పైకప్పులు. పాతతరాల ప్రముఖులతైలవర్ణపు చిత్రాలు.

పగలు ఎలాగోలా కాలక్షేపం చేసినా, పరిసరాలు ఎంత భావుకతతో చూసినా, రాత్రిమాత్రం భయమేస్తోంది. ఇదివరలో చూసిన డాక్‌బంగళా దెయ్యాల సినీమాలన్నీ జ్ఞాపకం వస్తున్నాయి. నిద్రలో పీడకలలు, తెల్లబట్టల్లో తిరుగాడే కామినీ పిశాచాలు. హిందీలో సినిమా పాటలుపాడుతూ తిరుగుతున్నాయి. ఫ్యూడలు వ్యవస్థ వేళ్లూనిన కాలంలో అక్కడ జరిగినవన్నీ న్యాయాలేకాని అన్యాయాలనడం ఎవరి తరం? ఎందరికి క్రమంగా అక్రమాలు జరిగేయో? ఎందరిప్రేతాత్మలు తరించలేక తిరుగాడుతున్నాయో? ఎందరి తీరని కోర్కెలు సమాధి అయ్యాయో? ఎందరి బ్రతుకులు నడిరాత్రి తెల్లవారిపోయాయో? ఎందరి శీలాలు వెలకట్టక నిలువు దోపిడీలకు గురయ్యాయో?

నిద్రకుదూరమై, హాల్లో బీరువా తీసి ఒకలెడ్జరు ముందేసుకు కూర్చున్నాను. బాంకులో మేనేజరు అంటే,ఇలాంటి చిన్న బ్రాంచిల్లో కాకా హోటలు ప్రొప్రయిటర్లా అన్ని పనులూ తనే చేసుకోగలిగిఉండాలి. స్టాఫ్ చెప్పినపని సకాలంలో కాని అకాలంలోకాని చేస్తారని ఆశపెట్టుకోకూడదు. హాఫ్ ఇయర్లీ క్లోజింగ్ వస్తోంది. ఇంటరెస్టులు కట్టి లెక్కలు తేల్చేపని అలాగే ఉంది. నేను తీసుకున్న లెడ్జర్లో ఎక్కౌంట్లన్నీ అక్కడకి దగ్గర్లో గల గిరిజన గ్రామాల్లోనూ తండాల్లోనూ I.R.D.P. క్రింద ఇచ్చిన ఋణాలు. రెండుమూడేళ్ళుగా అసలు జమల్లేవు. కొన్ని పత్రాలు కాలదోషం పట్టి కాలం చెల్లిపోయాయి కూడా. వీలైనంతమటుకు వసూలు చేసి, పత్రాలపై సంతకాలు పెట్టించుకోవాలి. అసలు వీళ్లందరూ ఉన్నారో లేరో కూడా తెలీదు.

ఈ ప్రాంతపు ప్రజలకు అడవులే జీవనాధారం. అడవులను సమూలం నాశనం కానివ్వకుండా పర్యావరణ సమతుల్యం కాపాడుతుంది వాళ్ల జీవనసరళి. షిఫ్టింగ్ కల్టివేషన్ లేక పోడు వ్యవసాయంగా పేరొందిన వాళ్ల వ్యవసాయం కాలం చెల్లిన పద్ధతి అని నాగరికుల భావన. అడవులను అక్రమంగా నరుకుతున్నారని శిక్షించే ప్రభుత్వం అదే అడవుల్ని కంట్రాక్టర్లకు నామమాత్రపు సొమ్ముకు అమ్ముకుంటుంది. అడివి ఎవరిదీ కాదు. అందరిదీను. సామూహికంగా ఉండే ఈ అడవులు బ్రిటిషు వాళ్లు రూపొందించిన ఫారెస్ట్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ పరమయ్యాయి. ఈ చట్టాలకు నల్లదొరలు మరింత పదునుపెట్టారు. గిరిజనుల హక్కులను సంరక్షిస్తున్నామంటూనే నిర్దాక్షిణ్యంగా కాలరాచారు. తమతమ జన్మభూముల్లో స్వర్గసుఖాల్లేకున్నా స్వర్గమనే భావంతో జీవనం కొనసాగించే వీళ్లను ఆయా ప్రదేశాల్లో ప్రవాసులస్థాయికి తెచ్చారు. నిస్వార్ధంగా గిరిజన జీవితాలను అధ్యయనం చేసి వాళ్ల మధ్య జీవించివాళ్ల సమస్యలను అవగాహన చేసికొన్న వెర్రియర్ ఎల్విన్ వాన్ హోమిడ్రాఫ్ మహానుభావుల భావాల భావాలు. ధృతరాష్ట్ర ప్రభుతకు విదురనీతులై లైబ్రరీల్లోని బొండు పుస్తకాల్లో తలదాచుకున్నాయి.

జమీందారీ ప్రాంతాల్లో కూడా స్వాతంత్ర్యానంతరం బ్రిటిషు దమననీతి అమల్లోకి వచ్చింది. గిరిజనుల హక్కులు రక్షించే చట్టాలు రూపొందించినా కంటి తుడుపు చర్యలుగానే మిగిలాయి. రాజకీయ నాయకులు స్మగ్లర్లూ అడవుల్ని బాహాటంగా దోచుకుంటున్నారు. చెట్లను .నాటు, చెట్టును రక్షించు 'వృక్షోరక్షతి రక్షితః' వంటివి హిపోక్రసీకి మచ్చుతునకలు.


ఈ నేపథ్యంలో మిగతా ప్రాంతాలలో అమలు పరిచే IRDP పథకాలను పిడిక్కి బియ్యానికే ఒకటే మంత్రం అన్నట్టుగా అటవీ ప్రాంతపు ప్రజలకు కూడా వర్తింపజేసి దారిద్ర్య దూరీకరణ ప్రయత్నాలు మొదలెట్టారు.

రెండు తట్టల ఉసిరికాయలను 5 రూపాయలకు అమ్మేసే వీళ్ళ అమాయకత్వాన్ని సొమ్ము చేసేందుకు గెస్టుహౌసుకు పిక్నిక్ వచ్చిన బ్యాంకు బాబులు కూడా వెనుకాడరు.

సరిగ్గా తలచుకున్న సందర్భాల్లో బ్యాంకులు కూడా కాబూలీవాళ్ళలాగా అప్పులు వసూలు చేస్తాయి. అయినా వసూళ్ళు కాకపోవడానికి సిబ్బంది నిర్లక్ష్యం కూడా కారణం. పెద్దవాళ్ళ పెద్ద బాకీలు అడిగే దమ్ము ఎలాగూ లేదు. చిన్నవాళ్ళ నుంచి వసూలు చేసే తీరిక లేదు. గుర్రాల మీదా, గాడిదల మీదా సమానంగా కాసే వెన్నెల్లా నెలయ్యేసరికి పని చేసినా, చెయ్యకున్నా జీతం వస్తుంది. ఇదివరకటి మేనేజరు తరచు సెలవు పెట్టి బ్రాంచిని తగలేశాడు. నేను ఉద్ధరించాలని నిర్ణయించుకున్నాను. బ్రాంచ్‌ని ఉద్ధరించడమంటే ఉద్ధరించబడని గిరిజనుల జీవితాలను అతలాకుతలం చేయాల్సి వస్తుందని నాకా క్షణంలో అనిపించలేదు. రాత్రి ఎలాగో నిద్ర పట్టేందుకు తీసుకున్న నిర్ణయమే.

★ ★ ★

వేరే సంసారం లేని నేను ఫీల్డ్ ఆఫీసర్ బెహరాతో ఆదివారం ఫీల్డ్ విజిట్‌కు వెళ్ళేందుకు ఒప్పించాను. పొద్దున్న 9 గంటలకు బయల్దేరాం.



చిట్టడివిలో అక్కడక్కడా కుగ్రామాలు. గర్భిణీలకు ప్రసవానికి, ముసలివాళ్ళకూ, పిల్లలకూ వైద్యసౌకర్యం అంటే నాబోటివాడికి కాంటెస్సా కారులాంటిది. మంచం సవారీపై మైళ్ళు మోసుకొచ్చాక కూడా నామమాత్రంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందు పడుతుందని, ఆ మందు సంజీవిలా పని చేస్తుందని నమ్మకం లేదు. చెరకు పంటను పాడు చేసే ఏనుగులు, అక్కడక్కడా తిరుగాడే తోడేళ్ళు, చిరుతపులులు వెరసి నాకు చెప్పరాని భయమేసింది.

కొంచెం బాగా కనిపించే ఇంటిముందు ఆగాం. అది గిరిజనేతర కుటుంబం. ఎక్కడ్నించో వచ్చి ఇంత భూ వసతి సంపాదించి ఎదుగుతున్న సంసారం. బ్యాంకు అప్పుతో కొన్న కుట్టు మిషన్ ఉంది. కాని, బట్టలు లేవు. కట్టుకునేందుకు సరైన బట్టలు లేని వాళ్ళు దగ్గర నిత్యం బట్టలెలా కుట్టుంచుకుంటారు? బాకీ అందుకే తీరలేదు.

మరోచోట గేదెలకో, ఆవులకో ఇచ్చిన రుణం. దాహమేసి మంచినీళ్ళడిగితే చల్లని నీళ్ళు ఇచ్చారు. గేదెలకు మేత లేదు, తాగేందుకు నీళ్ళు లేవు. ఇంక పాలెలా ఇస్తాయి? అవి ఎవరు కొంటారు? బాకీ ఎలా తీరుతుంది? మంచినీళ్ళు తాగినందుకు గిల్టీగా ఫీలయ్యాను.

ఇంకో చోట కిరాణా దుకాణానికి అప్పు. కొట్లో సరుకు 200 విలువ కూడా చెయ్యదు. ఊరంతా గాలించినా 10 ఎర్రని ఏగాణీలు కూడా దొరకవు. అందరూ సరుకులు అరువుగా పట్టుకుపోయారు. వాళ్ళు ఈ జన్మలో తీర్చరు. ఈ బేరాల్లో లాభాలు వస్తే కదా బ్యాంకు లోను తీరేది?

కొంచెంసేపట్లో ధారాపాతంగా వర్షం మొదలైంది. ఒక గుడిసెలో తలదాచుకున్నాం. చీకటిగా ఉన్నా ఎవరి ఇళ్ళల్లోనూ దీపాలు లేవు. లీటరు అంత ఖరీదు పెట్టి వీళ్ళు కిరసనాయిలు ఎక్కడ కొంటారు? అక్కడ అంధకారం కాక వెలుగెలా ఉంటుంది?

తిరుగు ప్రయాణంలో కలిసిన రుణదారుడు, వడ్రంగానికి అప్పు తీసుకున్నాడు. బ్యాంకు లోనుతో కొన్న చెక్కను ఫారెస్టు ఉద్యోగులు దౌర్జన్యంగా తీసుకెళ్ళి, అతను కొన్న అడితిలోనే మళ్ళీ అమ్మేశార్ట. వడ్రంగి అని కులం సర్టిఫికెట్ నాకు ఇప్పించండి అన్నాడు. అది బ్యాంకు వాళ్ళు ఇవ్వరు. బి.డి.ఒ. కాని తహసిల్దారు కాని ఇస్తాడు. 'కొబ్బరి చెట్టుకు మడిబట్టలు కట్టిన' సామెత జ్ఞాపకం వచ్చింది.

కుండపోతగా వర్షం. వాగులో నుంచి స్కూటరు తోసుకుని గట్టుపైకెక్కాం. కాని ఈ గిరిజనుల జీవితాలు అంత త్వరగా గట్టెక్కుతాయా?

ఈ బాకీలు వసూలవుతాయా? మేనేజరుగా నేను సమర్థుణ్ణి అనిపించుకుంటానా? రెండుమూడేళ్ళు రూరల్ ఎసైన్‌మెంట్ చేస్తే మంచి సెంటరు దొరుకుతుంది. వాళ్ళు తీర్చలేని రుణాల్ని వాళ్ళ నెత్తిన రుద్దిన ఈ బ్యాంకులు, బంగారు కంకణాల్ని ఆశపెట్టిన ముసలి పులుల్లా అనిపించాయి.

వందల మైళ్ళ దూరంలో కూడా భాషలు వేరైనా భావాలొక్కటే అని, కథలు వేరైనా వ్యధలొక్కటే అని, ప్రభుత వేరైనా దమన నీతి ఒక్కటేనని అనిపించింది. అడవిలోని ఆకుల్లా, మోడువారిన మాకుల్లా, బతుకు పోరులో చెదిరిన ఏకాకుల్లా అనిపించారు.

రాత్రంతా కలత నిద్దర. 'మా బతుకుల్ని ఇంకా చించేస్తావా!' అంటూ వాళ్ళు నన్ను తరుముతున్నట్టు కల. మర్నాడు జ్వరం వచ్చేసింది. రీజనల్ ఆఫీసుకు ఫోన్ చేసి, కాళ్ళావేళ్ళా పడి వారం రోజులు సెలవు పెట్టి మా ఊరు వచ్చేశాను. ●

# పాశ్చాత్య పండితుల వేదాధ్యయనం

పాశ్చాత్య పండితులు పలువురు వేదాధ్యయనానికి వైజ్ఞానిక సత్యాలను ప్రపంచానికి చాటడానికి జూలై 1,7 సంచికలలో కొంత వివరించడమైనది. వేద విజ్ఞానానికి కృషి చేసినవారిలో మాక్స్‌ముల్లర్ తర్వాత వారు థియొడర్ జాఫ్రైట్ (1822—1903) జార్జి బ్యూలర్ (1837—1898) ఫ్రెడరిక్ గెల్డెనర్ (1858—1929

ఇక ఛార్లెస్ రాక్వెల్ లాన్‌మాన్ (1853—1925) ఆర్థర్ ఆందోనా మూక్డానెల్ (1854—1931 ఆర్థర్ బెరిడేల్ కౌల్ (1879—1941)లు చేసిన పరిశోధనలతో 1940 వరకు పాశ్చాత్య పండితుల వేద విజ్ఞానానికి చేసిన సేవను గురించి చరిత్ర వెల్లడి కాగల్గుతుంది. లాన్‌మాన్ 1891 నుండి హార్వర్డ్ విశ్వవిద్యాలయం సంస్కృత ప్రధానాచార్యుడుగా ఉంటూ హార్వర్డు ప్రాచ్య గ్రంథమాల అనే పేరుతో అనేక సంస్కృత గ్రంథాలను ప్రచురించారు. విట్నీ ప్రతిక (1906) బెండీల్‌కొల్ పండితుని తైత్తిరీయి సంహిత అంగ్లానువాదము (1914) ఋగ్వేదీయ బ్రాహ్మణముల అనువాదము (1920) వేదోపనిషత్తుల యందలి మత దర్శనముల (1925) అత్యాదులు ఈ గ్రంథములలో ప్రచురించబడినవి. మాక్డొనెల్ పంజితుడు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో సంస్కృత ప్రధానాచార్యుడు. ఈయన వైదిక వ్యాకరణము సంస్కృత ఆంగ్ల నిఘంటువువైదికనామ విషయానుక్రమణికా అను గ్రంథములను రచించి ప్రసిద్ధుడు కావడమేకాక 1928లో ఆక్స్‌ఫర్డ్ నగరంలో జరిగిన అంతర్జాతీయ ప్రాచ్య విద్యను మహాపరిషత్తుకు అధ్యక్షత వహించినాడు. ఇక అందరిలోకీ కడపటివాడు, ఆధునాతనుడైన జెరిడేల్‌కీట్ ప్రాచ్య విజ్ఞాన ప్రపంచంలో ముట్టని అంశం అంటూ లేదంటే అతిశయోక్తి కాదు. బహు గ్రంథములను రచించినాడు. ఇతడు రచించిన సంస్కృత నాటక చరిత్రమూ సంస్కృత వాఙ్మయాలౌకిక —చరిత్రను సుప్రసిద్ధుడే. ఈ మహామహలనేకాక 1852—75 నడుమ ఏడు సంపుటములలో బృహత్ సంస్కృత నిఘంటువును నిర్మించిన ఇద్దరు జర్మన్ దేశ వేద పండితులు ఆటో బోయిల్లోంగిలను ఏడిలంగ్ లీబర్‌స్మాల్, లిరన్‌హార్‌లిట్జ్, వింటురనిట్జ్, ఫ్రెబర్ గోల్డుస్టూతర్, విల్సన్, లుడ్విగీ మొదలగు పండితులను కూడా వారు వేద వాఙ్మయమునకు చేసిన విశేష సేవలకై నిరంతరమూ సంస్కరించవలసి యున్నది.

ఇక వేదాలలో ఉన్నది ఈనాడు ప్రకటించపబడుతున్న అంశాలేనని చెప్పడానికి ఒకే ఒక ఉదాహరణ చాలవచ్చు.

అగ్నిః పూర్వరూపం, ఆదిత్య ఉత్తరమరూపం, ఆపః సంధిః
వైద్యుతః సంధానం—ఋగ్వేద మంత్రం

జ్వలన రూపమగు అగ్నివాయువు లేక ఉదజని, ఆదిత్య రూపమగు ప్రాణవాయువు వైద్యుతమువలన అనగా విద్యుచ్ఛక్తి లేక ఎలక్ట్రిసిటీ వలన సంధానము చేయబడి సంధి రూపమగు ఆపసేగా అనగా దిదకములుగా ఏర్పడినవీ అని దీని అర్థం. ఇదే ఆధునిక ఎలక్ట్రలిసిస్ సిద్ధాంతం. రెండు పాళ్ళు ఉదజని+ఒక పాలు ప్రాణ వాయువు. జలం అనేది.

వేలాది తాళపత్ర గ్రంథాల సహాయంతో పరిశోధన గావింపబడి స్థానికంగా కొన్ని వేల సంవత్సరాలుగా దీన్ని వివిధ భాషల గ్రంథాలలోని వైజ్ఞానిక విషయాలతో పోల్చి సరిచూడబడి చివరికి సైన్స్‌గా వెలువరింబడినాయి అనడానికి ఇదే చక్కని ఉదాహరణ.

ఆదియత్యలే జయతే సృష్టిః ఈ సృష్టి అంతా సూర్యుడి నుండి కలుగుచున్నది అని మన భూమికి సంబంధించిన చరాచర సృష్టిని అంతటినీ గురించి చెప్పిన విషయం. అయితే ఈ సూర్యుణ్ణి సృష్టించింది ఎవరు? అనే ప్రశ్నకు సమాధానంగా 'సహస్రం సూర్యతయా ఇతి వైశంపాయనః— ఇటువంటి సూర్యులు అనేక వేల సంఖ్యలో ఈ బ్రహ్మాండమునకు అధిపతులుగా ఉన్నారు అని చెప్పి.

వేదగ్రజ్యోతి సవిలస్వమధ్యే
ఇమేవైలో కాపి అపాంరసః
వేరణ్యగర్భం పశ్యత జాయమానం

ఈ భూమి మొదలైన గ్రహమండలములన్నీ మొదట మండుచుండు వాయు రూపములు లేక జ్యోతిషములనీ, అవి తదుపంద్రవరూపములై ఆ తదుపరి ఘనీభవించినవనీ, వీటిలో అంతటా ఉన్నది జ్యోతిస్సు లేక వాయువు లేక అగ్ని మాత్రమేనని, ఆ అగ్ని, వాయు, సూర్యులే అనగా స్థాన భేదములవలన వేరు పేర్లతే చెప్పబడిన సృజన శక్తి లేక జ్ఞాన శక్తియే సృష్టికర్త అని స్పష్టం చేయబడినది. ఇదే నెబ్యులర్ థియరీగా, సింగ్యులర్ కాన్షన్స్ థియరీగా మారిందని చెప్పడానికి సందేహించనక్కరలేదు. కాని వేదాలలోని ఈ మహత్తర సత్యాలను భారతీయ వేద పండితులు విస్మరించి, అయోమయ స్థితిలోపడి, అసలు వేదాధ్యయనాన్ని విసర్జింపవేసే పరిస్థితి రాగా పాశ్చాత్య వేద పండితులు తమ జీవితాలనే వేదాధ్యయనానికై అంకితం చేసి విసర్జించివేసే పరిస్థితి రాగా పాశ్చాత్య వేద పండితులు తమ జీవితాలనే వేదాధ్యయనానికై అంకితం చేసి ఎలా ఈగూఢ సత్యాలను వెలికి తేయగలిగారా? అనేదే అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది!

సన్నిధానం
యజ్ఞనారాయణమూర్తి